


# బాబోయ్ టీవీ

**- కాశీభట్ల శశికాంత్**

రాజేష్ టి.వి. చూస్తున్నాడు. అతని భార్య రాధ వంటపని ముగించుకుని హాల్లోకి వచ్చి టి.వి.లో ఏ ప్రోగ్రాం వస్తోందా అని చూసింది. టి.వి.లో ఏంకరు మెలికలు తిరుగుతూ ముద్దుముద్దుగా మాట్లాడుతుంటే భర్త ఆనందంగా ఆ ప్రోగ్రాం చూస్తున్నాడు. ఆమెకు చిరాకువేసి ఛానల్ మార్చింది.

''అదేమిటే చూస్తున్నా ఛానల్ మార్చేశావు'' అన్నాడు రాజేష్.

''ఏడిసినట్టు ఉంది. అది గారాలు పోవడం, మీరు మురిసిపోవడం చెత్త ప్రోగ్రాం''అంది ఆమె.

ఆమె ఇప్పుడు పెట్టిన ఛానల్‌లో ఏదో సీరియల్ వస్తోంది. అందులో ఒక పాత్ర తన భార్యను హత్య చెయ్యడానికి పథకం పన్నుతున్నాడు. రాధ భర్తకేసి చూసింది. అతను ఆసక్తిగా ఆ సన్నివేశాన్ని చూడటం గమనించేసరికి ఆమెకు ఖంగారువేసి ఛానల్ మార్చి అమ్మయ్య అనుకోబోయింది. కానీ ఆ ఛానల్‌లో హీరోయిన్ టైట్ టీషర్ట్ వేసుకుని వానలో తడుస్తూ పాటలో వచ్చే మ్యూజిక్‌తో సంబంధం లేకుండా ఊరికే పరిగెడుతూ, గెంతుతూ ఉండేసరికి చిరాకువేసి టి.వి. కట్టేసింది.

''సరదాగా టి.వి. చూస్తుంటే కట్టేసావేమిటే'' అన్నాడు రాజేష్.

''అన్నీ దరిద్రపు ప్రోగ్రాంలే. ఇపుడు టి.వి. చూడకపోతే వచ్చే నష్టం ఏమీలేదు'' అంది.

''నష్టం ఎందుకు లేదు. కేబుల్ వాళ్ళకి నెలకి రూ.150/-లు అంటే రోజుకి రూ.5/- కడుతున్నాం. ఏ ప్రోగ్రాంలు చూడని దానికి ఆ దండగ ఖర్చు ఎందుకు? కనీసం న్యూస్ ఛానల్ పెట్టు. ప్రపంచం ఎటు పోతోందో తెలుస్తుంది'' అన్నాడు.

ఆమె టి.వి. ఆన్‌చేసి 'ఆలోచించండి' న్యూస్ ఛానల్ పెట్టింది.

''ఈ ఛానల్‌లో ప్రోగ్రాంలు చాలా బాగున్నాయట. మా కొలీగ్స్ అన్నారు. మన చుట్టూ జరుగుతున్న మోసాలు, అవినీతి, అధికారుల నిర్లక్ష్యం ఒకటేమిటి అన్నిటినీ బయటపెడుతున్నారట''అన్నాడు రాజేష్.

టి.వి.లో ఏంకరు అస్తవ్యస్తంగా ఉన్న రోడ్ల గురించి, అధికారుల నిర్లక్ష్యం గురించి చెబుతున్నాడు.

''మన సిటీ గురించే చూపిస్తున్నారు ఈరోజు'' అన్నాడు రాజేష్.

టి.వి.లో నీరు నిలిచిపోయిన రోడ్లను చూపిస్తున్నారు. ''డ్రైనేజ్ సిస్టం సరిగాలేక వర్షంనీరు పోవడం లేదు. గతుకుల రోడ్లపై నీరు నిలిచిపోయి వచ్చేపోయేవారికి చాలా ఇబ్బందికరంగా ఉంది. ఈ వీధిలో చూడండి'' అన్నాడు ఏంకరు.

కెమేరా ఒక వీధిలోకి తిరిగింది. రోడ్డుపై జనం నీళ్ళతో నిండిన గోతులను దాటుకుంటూ నడుస్తున్నారు..

''నాన్నా నువ్వే టి.వి.లో'' ''రాజేష్ కొడుకు ఆనందంగా అరిచాడు.

''అవునండి మీరే. ఎపుడు తీసారు ఇది. మాకు చెప్పనే లేదు'' అంది రాధ.

''నాకూ తెలియదు. ఈరోజులలో షూటింగ్ చెయ్యడం అంటే పెద్ద పెద్ద కెమేరాల హడావుడి ఏమీ ఉండటంలేదు. చాలా సింపుల్ అయిపోయింది. ఏ పక్కనుంచో తీసి ఉంటారు'' అన్నాడు. టి.వి.లో రాజేష్ నడిచి వస్తున్నాడు. చేతిలో కూరల సంచీ ఉంది.

''మొన్న స్కూటర్‌కి పేచ్ పడితే మెకానిక్ షెడ్‌లో ఇచ్చి అక్కడికి దగ్గరే కదా అని మార్కెట్‌కి నడిచి వెళ్ళాను. కూరలు తీసుకుని వస్తున్నప్పుడు తీసారన్నమాట'' అన్నాడు రాజేష్.

''ఆవిడ ఎవరండీ మీతోపాటు నడుస్తోంది'' నిశితంగా చూస్తూ అంది రాధ.

''ఎవరో నాకేం తెలుసు. రోడ్డుమీద బోలెడుమంది వెళుతూ ఉంటారు.''

''అదేమిటండీ ఆమె మీ వెనకే వస్తోంది. చూస్తుంటే మీరిద్దరూ కలిసి నడుస్తున్నట్టుగా ఉంది'' అంది.

''మతిలేకుండా మాట్లాడకు. ఆవిడ వెనక ఎక్కడో ఉండి ఉంటుంది. టి.వి.లో దూరం తెలియదు'' అన్నాడు రాజేష్.

''అవునమ్మా టి.వి.లో క్రికెట్ చూస్తున్నపుడు ముందు నుంచి చూస్తుంటే వికెట్ కీపర్ వికెట్లకి బాగా దగ్గరగా ఉన్నట్టుగా కనబడుతుంది. సైడ్ ఏంగిల్ చూపించినపుడు తెలుస్తుంది. వికెట్లకి ఎంత దూరంలో ఉన్నాడో'' అన్నాడు కొడుకు.

కొడుకు టి.వి.లో క్రికెట్ చూస్తూ టైం వేస్ట్ చేస్తున్నాడని తిట్టేవాడు. కానీ వాడి పరిజ్ఞానం ఇలా ఉపయోగపడుతుంది అనుకోలేదు. కొడుకుని మనసులోనే మెచ్చుకున్నాడు. ఆ సమయంలో ఆ ఛానల్ చూడటం ఇబ్బందికరంగా అనిపించింది.

''వేరే ఛానల్ పెట్టు. మన రోడ్ల గురించి మనకు చెప్పేదేముంది'' అన్నాడు.

''ఎందుకులెండి. ఈ ఛానల్ మీరన్నట్టే చాలా ఇంటరెస్టింగ్‌గా ఉంది'' అంది రాధ.

రాజేష్ ఇబ్బందిగా కుర్చీలో కదిలాడు.

''అదుగో ఆవిడ మీతో మాట్లాడుతోంది. ఎవరో తెలియదన్నట్టు చెబుతారేం'' కుర్చీలో ముందుకు జరిగి టి.వి.కేసి చూస్తూ అంది రాధ.

''అబ్బ రాధా వెళుతూ వెళుతూ ఆవిడ టైం అడిగి ఉంటుంది. ఆమాత్రం దానికి తెలిసి ఉండాలా?'' చిరాగ్గా అన్నాడు.

''మరీ వెర్రిదానిని చేసి మాట్లాడకండి. ఆవిడ చేతికి వాచీ కనబడుతోంది. మిమ్మల్ని అడగడం దేనికి?'' అంది.

''అది ఆగిపోయి ఉండవచ్చు కదా. అయినా ఆవిడ ఎందుకడిగిందో నాకేం తెలుసు'' విసుగ్గా అన్నాడు.

''టైం అడగడానికి అంత నవ్వుతూ అడగాలా?''

''లేకపోతే గోతులతో ఉన్న ఆ రోడ్డు గురించి ఏమైనా కామెంట్ చేసిందేమో. నాకు గుర్తులేదు.''

''అవునులెండి. ఒక పక్క నుంచి కెమేరాలతో పిక్చరైజ్ చేస్తున్నా స్పృహేలేదు మీకు. ఏ ధ్యాసలో ఉన్నారో'' కోపంగా అంది.

''అర్థంలేకుండా మాట్లాడకు.''

''అబ్బ మీరు కూడా ఆవిడ ముందు నవ్వులు ఒలకబోస్తున్నారే. పెళ్ళాం ముందు నవ్వులు రావు. బయట తెగ సరదాగా ఉన్నారు.''

''పక్కన చిన్న కుర్రాడు ఉన్నాడు. ఆలోచించి మాట్లాడు'' నెమ్మదిగా అన్నాడు.

''మీరు ఆలోచించి పనులు చేస్తున్నారా?'' అని టి.వి.కేసి చూసి ''ఎర్రగా నాజూకుగా ఉంది అంతేగా'' అని ''ఒహో ఈవిడేనా జ్యోతిచిత్ర'' అంది సడన్‌గా గుర్తొచ్చి.

''జ్యోతిచిత్ర ఎవరు?''

''గుర్తులేనట్టు నటించకండి. మొన్న ఫోన్‌చేసి టి.వి.లో ఏంకర్‌లాగ ఒకటే గారాలు పోయిందిగా.''

''ఒహో సితారా. ఆ అమ్మాయి పేరు. నా క్లాస్‌మేట్ ఆ అమ్మాయి''.

''మీరు ఆడవాళ్ళతో తప్ప స్నేహం చెయ్యరా? ఇంతకీ ఆవిడ చంకలో పాప ఎవరో?'' అంది.

''బాగా ఆకలేస్తోంది. భోజనం పెట్టు'' అన్నాడు.

''కాసేపు ఆగండి. ఈ వ్యవహారం ఏదో తేలాక మీకు అన్నం పెట్టాలో లేదో తేల్చుకుంటాను.''

''ఏమీ లేని దానికి అనవసర రాద్ధాంతం చేస్తున్నావు.''

''ఆ... ఆ... ఆ పాపని ఎత్తుకున్నారు కూడాను'' గాభరాగా అంది రాధ.

''ఆ నీళ్ళతో నిండిన గోతుల మధ్య నడవలేక...'' అతను ఇంకా ఏదో అనబోతుంటే అతని మాటను కట్‌చేసి ఆమె అంది. ''టైం చెప్పినపాటి పరిచయానికి పాపను మీకిచ్చిందంటారు. బాగుంది. పోనీ ఆ వెనక నడిచే ఆయనను ఎత్తుకోమనవచ్చుకదా. ఒక చేతిలో కూరల సంచీతో నడుస్తున్న మిమ్మల్నే ఎందుకు అడిగిందో?''

''ఆయన ముసలాడు. ఎలా ఎత్తుకోగలడు.''

''అవునులెండి. మీరు కుర్రాళ్ళు. ఇన్‌సర్ట్ చేసుకుని స్టైల్‌గా ఉన్నారు'' అంది.

''ఇలా అంటే అలా అంటావు. నీతో పెద్ద చిక్కు వచ్చింది.''

''అమ్మా ఆ అమ్మాయి అచ్చు చెల్లిలా ఉందే'' అన్నాడు కొడుకు.

''పిచ్చిపిచ్చిగా వాగకు. నువ్వు చదువుకోవాల్సింది ఏమీ లేదా? పెద్దవాళ్ళతో సమానం టి.వీ. చూస్తున్నావు'' కసురుకున్నాడు కొడుకుని.

''వాడినెందుకు తిడతారు. నాకూ అలాగే అనిపిస్తోంది.''

''కళ్ళుపోతాయి అలా పాపపు మాటలు మాట్లాడితే.''

''పాపపు పనులుచేస్తే పోలా కళ్ళు.''

''చూసారుగా ఆ భార్యాభర్త ఎంత ఇబ్బంది పడుతున్నారో నడవడానికి. పదండి మరో వీధికి వెళదాం'' అన్నాడు ఏంకరు. కెమేరా మరో వీధిలోకి తిరిగింది.

"అమ్మో అమ్మో. అయితే పెళ్ళి కూడా చేసేసుకున్నారన్న మాట. ఎంతకు తెగించారు" అసలే పెద్దవిగా ఉన్న కళ్ళని వీలయినంత పెద్దవి చేసి అంది.

"ఇంతకాలంగా కాపురం చేస్తున్నా నువ్వే అనుమానించావు. ఇంక టి.వి. వాళ్ళకేం తెలుస్తుంది. ఏదో పొరపాటున అనేసారు."

"పొరపాటుగా అనడం కాదులెండి. అందరికీ అలా అనిపించేలా ఉన్నారు మీరిద్దరూ" ఏడుపు గొంతుతో అంది రాధ.

"అదుగో అపుడే ఏడుపు మొదలుపెట్టావు. అనుమానించడానికైనా అర్థం ఉండాలి" చిరాగ్గా అన్నాడు.

"ఈ ఛానల్‌వాళ్ళు ఏవేవో బయటపెడుతున్నారంటే ఏమో అనుకున్నాను. ఇవాళ మీ గుట్టు బయటపెట్టి నా కళ్ళు తెరిపించారు. ఎంతకాలంగా సాగుతోంది ఈ వ్యవహారం".

"అబ్బే అదేమీ లేదే."

"మిమ్మల్ని అడిగితే నిజం చెబుతారా. ఆ పాపకు రెండేళ్ళ వయస్సు ఉంటుంది. అంటే కనీసం మూడేళ్ళుగా జరుగుతూ ఉండి ఉండవచ్చు. ఏమో ఇంటి దగ్గర పెద్ద పిల్లాడినో పిల్లనో వదిలేసి ఉండవచ్చు. అంటే అయిదేళ్ళుగా గుట్టుగా నెట్టుకొస్తున్నారన్న మాట."

"ఇంత చిన్న సంఘటనకి అయిదేళ్ళ హిస్టరీ తయారుచేసావా. నువ్వు అసాధ్యురాలివే" విస్మయంగా అన్నాడు రాజేష్.

"రెండు ఫేమిలీలు గుట్టుగా నడుపుకొస్తున్న మీముందు నేనెంతలెండి. ఈ ప్రోగ్రాం అందరూ చూసే ఉంటారు. మన పరువు గంగలో కలిసింది."

ఫోన్ మోగింది.

"హలో"అన్నాడు రాజేష్.

"ఏరా రాజేష్ ఇపుడే టి.వి.లో నీ ఘనకార్యం చూసాం. ఎప్పటినుంచి సాగుతోంది ఈ వ్యవహారం. తండ్రి కోపంగా అన్నాడు.

"నాన్నా అదంతా ఉట్టిదే. వాళ్ళేదో పొరపాటు పడ్డారు" ఖంగారుగా అన్నాడు రాజేష్.

"నోర్మూయ్యరా. వెధవ పనులుచేసి ఇంకా మాట్లాడుతున్నావా. ఎక్కడికి పోతాయి వెధవ బుద్ధులు. నీవన్నీ మీ నాన్న పోలికలే" ఫోన్ లాక్కుని అంది తల్లి.

"దాని మాటలు నమ్మకురా. అన్నీ పుకార్లు" అన్నాడు తండ్రి.

"నామీదా ఇవి నీలాపనిందలే నాన్నా. బట్టతల లాగ, షుగర్ కంప్లైంట్ లాగ నీలాపనిందలు కూడా వంశపారంపర్యమేమో" విచారంగా అన్నాడు రాజేష్.

"అత్తయ్యగారూ చూసారా మీ అబ్బాయి ఏం చేసారో" రాజేష్ చేతిలోంచి ఫోన్ లాక్కుని అంది రాధ.

"నువ్వేం ఖంగారు పడకు. వాడు పిచ్చిపిచ్చి వేషాలు వేస్తే ఊరుకుంటానా. మేం వెంటనే బయల్దేరి వస్తున్నాం" అని ఫోన్ పెట్టేసారు.

మళ్ళీ ఫోన్ మోగింది.

ఈసారి ఫోన్‌లో మామగారి గొంతు విని ఉలిక్కి పడ్డాడు రాజేష్. "ఏమిటి ఇంతసేపు ఎంగేజ్ వస్తోంది. ఆ టీ.వి.లో దానితో మాట్లాడుతున్నావా" మామగారి గొంతు ఖంగుమంది ఫోన్‌లో.

"అబ్బే లేదండి. అసలు ఆవిడెవరో నాకు తెలియదు." ఖంగారుగా అన్నాడు రాజేష్.

"నాన్నా ఇంక ఇక్కడ ఒక్క క్షణం కూడా ఉండలేను. వెంటనే మన ఊరు వచ్చేస్తాను" ఏడుపు గొంతుతో అంది రాధ.

"ఈ రాత్రికి బస్సులు ఉండవు. రేపు పిల్లలని తీసుకుని వచ్చేయ్. లీగల్ విషయాలు నేను చూసుకుంటాను."

"మామగారూ మీ అమ్మాయికి చెప్పాల్సింది పోయి మీరే తొందరపడుతున్నారు" ఆదుర్దాగా అన్నాడు రాజేష్.

"తొందర పడింది నువ్వు. ఇంక నన్ను మామగారు అని పిలవకు. ఫోన్ పెట్టేయ్" విసురుగా అని ఫోన్ పెట్టేసాడు ఆయన.

టి.వి.లో ఇంకా ఆ ప్రోగ్రాం వస్తోంది. మీ అభిప్రాయాలను తెలియచేయండి అని ఒక ఫోన్ నెంబర్ కింద స్క్రోల్ అవుతోంది. ఆవేశంగా ఆ నెంబర్‌కి ఫోన్ చేసాడు రాజేష్.

"హలో ఆలోచించండి" అవతల నుంచి ఒక మొగ గొంతు వినిపించింది.

"మీ ఛానల్‌లో ఇపుడు ఒక ప్రోగ్రాం వస్తోంది. దానిని తీసింది ఎవరు?" అడిగాడు రాజేష్.

"నేనే కవర్ చేసాను. చెప్పండి. ప్రోగ్రాం బాగుందా"

"చెత్తగా ఉంది."

"ఓహో మీరు మున్సిపల్ వాళ్ళన్నమాట."

"కాదు. నన్నుకూడా ఆ ప్రోగ్రాంలో కవర్ చేసారు."

"ఏం బాగా కవర్ చెయ్యలేదా?"

"ఓవర్‌గా కవర్ చేసారు. నా దారిన నేను కూరల సంచీతో వెళుతుంటే, నా వెనక వచ్చే ఆవిడను నన్ను భార్యాభర్తలు అని చెప్పారు" అన్నాడు రాజేష్ తన గుర్తులు చెప్పి.

> "చాలా విచిత్రంగా ఉన్నాయి మీ పేరు, మీ ఊరి పేరు. ఇదివరకు రేడియోలో మీరు కోరిన పాటలు కార్యక్రమంలో శ్రోతల పేర్లలో విన్నాను ఇలాంటి పేర్లు. మళ్ళీ ఇదే వినడం. ఇంతకీ మీరేం చేస్తుంటారు"

"ఓహో మీరా. ఆవిడ మీ భార్యే కదా. మేడ్‌ఫర్ ఈచ్ అదర్‌లా ఉన్నారు."

"చంపేస్తాను. ఆవిడ నా భార్య కాదు" అరిచాడు.

"అఫ్‌కోర్స్ మీమధ్య ఎన్నో సంబంధాలు ఉండవచ్చు. కానీ అవన్నీ మీడియాలో చెప్పకూడదు. మర్యాదగా భార్య అనే చెబుతాం" పొలైట్‌గా అన్నాడతను.

"ఏడిసినట్టు ఉంది నీ మర్యాద. దీనివల్ల నా మొదటి ఛీ... ఛీ... అసలు కాదు కాదు ఏకైక భార్య విడాకులు ఇస్తానంటోంది" అన్నాడు రాజేష్.

"ఇంటరెస్టింగ్. 'ఆలోచించండి' ఛానల్ బయటపెట్టిన వాస్తవంతో విడాకులు కోరిన మహిళ అని రేపు ప్రసారమయ్యే "పర్యవసానాలు" ప్రోగ్రాంలో ప్రసారం చేస్తాం తప్పక చూడండి."

"మీమీద పరువునష్టం దావావేస్తాను" ఆవేశంగా అన్నాడు రాజేష్.

"మరీ మంచిది. ఎన్ని కేసులు ఉంటే మా ఛానల్‌కి అంత ప్రచారం" ఆనందంగా అన్నాడతను.

"అయితే నా గతేం కాను" ఏడుపు గొంతుతో అన్నాడు రాజేష్.

"ఆమె పెద్ద వాళ్ళతో మాట్లాడకపోయారా" జాలిగా సలహా ఇచ్చాడు.

"విడాకులు ఇప్పిస్తానంటున్నది మా మామగారే."

"చాలా బాగుంది. మీ ఎడ్రస్ చెప్పండి. వెంటనే మా యూనిట్‌తోపాటు వస్తాం."

"చేసిన ఘనకార్యం చాలు. నువ్వు ఈ చుట్టుపక్కల కనిపిస్తే మర్డర్ చేసేస్తాను. మీవాళ్ళు 'వారం వారం కొత్త నేరం' కార్యక్రమంలో ప్రసారం చేసుకుంటారు"అని విసురుగా ఫోన్ పెట్టేసాడు రాజేష్.

ఆ రాత్రి వరసగా ఫోన్‌లు వస్తూనే ఉన్నాయి.

"గురూ అమాయకుడిలా కనిపిస్తావు కానీ అసాధ్యుడివి" అని ఒకరు.

"ఒక ఫేమిలీని మెయింటైన్ చెయ్యడమే కష్టంగా ఉన్న ఈ కరువు రోజులలో రెండు ఫేమిలీలను ఎలా మెయింటైన్ చేస్తున్నావురా బాబూ" అని మరొకరు.

ఆ రాత్రంతా బతిమాలినా రాధ శాంతించలేదు.

మర్నాడు ఉదయాన్నే తనవీ పిల్లలవీ బట్టలు సూట్‌కేస్‌లో సర్దేసింది.

ఫోన్ మోగింది.

"హలో నీ గురించి చాలా కాలంగా వెతుకుతున్నాను. ఇన్నాళ్టికి దొరికావు" అన్నారు అవతలి నుంచి ఎవరో.

"ఎవడివయ్యా నువ్వు. నేనేమైనా తప్పిపోయినా ఏమిటి దొరకడానికి" అన్నాడు రాజేష్.

"నువ్వు తప్పిపోలేదు. తప్పించుకుంటున్నావు" అంది అవతలి గొంతు.

"ఇంతకీ నీకు ఎవరు కావాలి?"

"నువ్వే."

"కానీ నువ్వెవరో నాకు తెలియదు."

"నేను తెలియదా? గతిగన్నారం నుంచి గడ్డి అన్నారాన్ని".

"చాలా విచిత్రంగా ఉన్నాయి మీ పేరు, మీ ఊరి పేరు. ఇదివరకు రేడియోలో మీరు కోరిన పాటలు కార్యక్రమంలో శ్రోతల పేర్లలో విన్నాను ఇలాంటి పేర్లు. మళ్ళీ ఇదే వినడం. ఇంతకీ మీరేం చేస్తుంటారు" ఆనందంగా అన్నాడు రాజేష్.

"ప్రస్తుతం నిన్ను వెతకడం తప్ప వేరే పనిలేదు నాకు."

"మళ్ళీ మొదటికొచ్చారు. ఇంతకీ ఎందుకు వెతకడం."

"నీ పెళ్ళాన్ని అడుగు చెబుతుంది."

"మాటలు మర్యాదగా రానీ. గౌరవం లేకుండా నీ పెళ్ళాం ఏమిటి?" కోపంగా అన్నాడు రాజేష్.

"నా చెల్లెలుకి నేను గౌరవం ఇచ్చేదేమిటి?" అంది అవతలి గొంతు.

"అయితే మీరు నాకు బావమరిది అవుతారు. మరి ఇంతకాలం ఇలాంటి పేరున్నవాడు తన బంధువర్గంలో ఉన్నట్టు రాధ ఎప్పుడూ చెప్పలేదే."

"ఓహో అది పేరు మార్చుకున్నదన్నమాట."

"పెళ్ళయినప్పటినుంచి అదే పేరు. అంతకుముందు సంగతి నాకు తెలియదు. ఒక్క క్షణం లైన్లో ఉండండి" అని అతనితో అని "రాధా మీ కజిన్ దూరపు బంధువు అనుకుంటాను. గడ్డి అన్నారం లైన్నో ఉన్నాడు" అన్నాడు రాజేష్ రాధవైపు తిరిగి.

ఆమె మాట్లాడకపోతే మీ అన్నయ్యతో మాట్లాడడానికేం?"

"అలాంటి పేరుగల అన్నయ్యలెవరూ నాకు లేరు" విసురుగా అంది రాధ.

"దూరపు బంధువు అయి ఉంటాడు. గుర్తుతెచ్చుకో."

"అక్కరలేదు. మీకు చాలా బంధుత్వాలున్నాయిగా. ఎన్నో భార్యకి ఎన్నో అన్నయ్యో ఈ అన్నారం"అంది వ్యంగ్యంగా.

"ఓహో అయితే ఈయన ఆవిడగారి బంధువు అన్నమాట."

"అబ్బ ఎంత గౌరవం ఆవిడగారికి" చివరి పదం నొక్కి పలుకుతూ అంది రాధ.

"నువ్వు ఉండవే బాబూ"అని భార్యతో అని "అయ్యా గడ్డి అన్నారంగారూ మీరు నిన్న టి.వి.చూసి మాట్లాడుతున్నట్టున్నారు."

"అందులో చూసాకే నీ సంగతి తెలిసింది. రెండు నెలలుగా దాని గురించి నీ గురించి వెతుకుతున్నాం. చూస్తే మర్యాదస్తుడిలా ఉన్నావు. ఇంత వెధవ పని చేస్తావా?" కోపంగా అన్నాడతను.

(మిగతా 12వ పేజీలో)

